క్లుప్తంగా

చెత్తపాయింట్లను శుభ్రంగా ఉంచాలి



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న నగరపాలక అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్రన్

కడప కార్పొరేషన్: కడప నగరంలోని చెత్త పాయింట్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని నగరపాలక అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్రన్ అన్నారు. మంగళవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన రవీంద్రనగర్ ప్రాంతంలో పర్యటించారు. పారిశుద్ధ్య కార్మికుల హాజరు పట్టికలను పరిశీలించారు. కార్మికులు తప్పనిసరిగా యూనిఫారం ధరించాలని తెలిపారు. నగరంలో ప్రజల ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని మెరుగు పరిచేందుకు కృషి చేయాలని అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

9 నుంచి ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీ నుంచి టైలరింగ్, బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్, ఎంబ్రాయిడరీ ఫ్యాబ్రిక్ పెయింటింగ్, జ్యూట్ బ్యాగుల తయారీలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ ఆరీఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. 18–45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఆసక్తిగల నిరుద్యోగ మహిళల నుంచి ఉచిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. దూర ప్రాంతాల వారికి ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. ఇతర వివరాలకు 99409 05478, 99856 06866 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

ఆరోగ్య విషయాలపై అవగాహన



ఆశా కార్యకర్తలకు ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రతి వ్యక్తి ఆరోగ్య విషయాలపై అవగాహన పెంపొందించుకుని వ్యాధులకు దూరంగా ఉండేలా చూడాలని డాక్టర్ ప్రశాంత్‌వర్ధన్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆశా డే సందర్భంగా స్థానిక నాగరాజుపేట అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు ప్రశాంత్ వర్ధన్, ఆరోగ్య విద్యాధికారి ప్రసన్నలత ఆధ్వర్యంలో ఆరోగ్య విషయాలపై ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. డాక్టర్ సురేష్ కుమార్, హోమియోపతి వైద్య విద్యార్థులు శ్రీకృష్ణ, సునీల్, కృష్ణసాయి, ప్రసాద్, సునీల్ సాయి, సుబ్బరాయుడు, సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, ఏఎన్ఎం శైలజ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కామాంధుడిని శిక్షించాలి

కడప ఎడ్యుకేషన్: లక్కిరెడ్డిపల్లె బాలయోగి గురుకుల పాఠశాలలో విద్యార్థినిపై అత్యాచారయత్నానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని పీఆర్‌ఎస్‌వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ కన్నెలూరు శంకర్ డిమాండ్ చేశారు. మంగళవారం కడప నగరంలోని పీఆర్‌ఎస్ వైఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహిస్తున్న పరిమళ భర్త అక్కడ చదువుతున్న విద్యార్థుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. తక్షణమే ప్రిన్సిపల్ పరిమళను విధుల నుంచి శాశ్వతంగా తొలగించాలని , ఆమె భర్త బాలసుబ్బయ్యను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌ఎస్ వైఎఫ్ జిల్లా కన్వీనర్ ఓరుగంటి నాగేంద్రబాబు, నగర నాయకులు వెంకటేష్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



అదనపు డీయం అండ్ హెచ్‌వో కు వినతి పత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఆశా కార్యకర్తల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని డీఎం అండ్ హెచ్‌వో కార్యాలయంలో ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అదనపు డీఎం అండ్ హెచ్‌వో అధికారి ఉమామహేశ్వరరావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశావర్కర్ల వేతనాలు పెంచాలని కోరారు. స్థానిక రాజకీయ నాయకుల వేధింపులు ఆపి, ఆశా కార్యకర్తలకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ యూనియన్ జిల్లా కార్యదర్శి రాజామణి, సీఐటీయూ నాయకులు కే. ఓబుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిపూర్ణ సంతోష ప్రదాత ఆరోగ్యమాత

కడప కల్చరల్ : ఆరోగ్యమాత విశ్వాసులకు పరిపూర్ణ సంతోష ప్రదాత అని పలమనేరు డీన్, శివాడి విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ సుమన్, పీలేరు విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ ఎస్ అర్ జాన్‌లు అన్నారు. కడప నగరంలోని రైల్వేస్టేషన్ సమీపంలోగల ఆరోగ్యమాత పుణ్యక్షేత్రం నవదిన ఉత్సవాల్లో భాగంగా ఆరవరోజు మంగళవారం వారు దివ్యబలిపూజ సమర్పించి మరియమాత సందేశాన్ని వినిపించారు. వారు మాట్లాడుతూ కష్టాలలో ఉన్న విశ్వాసుల కుటుంబాలతో చేరి ఆరోగ్యమాత వారి సమస్యలను పరిష్కరిస్తుందని, వారందరికీ పరిపూర్ణమైన ఆరోగ్యం, సంతోషం ప్రసాదిస్తుందని తెలిపారు. మనకు కష్టమొచ్చినపుడు ఆదుకునేందుకు ఆరోగ్యమాత మనతోనే ఉంటుందని, దాన్ని విశ్వసించి కష్టాలలో ఉన్నప్పుడు ఆమెను వేడుకుంటే తప్పక కరుణించి ఆ కడగండ్ల నుంచి ఉపశమనం కలిగిస్తుందన్నారు. అందుకోసం ఆమె నిరంతరం మన మధ్యలోనే ఉంటుందని, విశ్వాసులు ఆమె పేరు జపిస్తూ సాన్నిహిత్యాన్ని సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా మరియమాత స్వరూపాన్ని కనులపండుగా అలంకరించి



మరియమాత స్వరూపాన్ని ఊరేగిస్తున్న భక్తులు



ప్రార్థనల్లో పాల్గొన్న విశ్వాసులు

ప్రత్యేక పల్లకీలో ఉంచి చర్చి ప్రాంగణంలో విశ్వాసులు ఊరేగింపు నిర్వహించారు. పాటలు, పల్లకీ, దివ్య బలిపీఠం, శివాడి విచారణ గాయకబృందం, జేఎంజే సిస్టర్లు నిర్వహించారు. ప్రార్థనలనంతరం పూజా ప్రసంగాన్ని అందించిన గురువులను శాంతి సేవా సొసైటీ సంస్థ జ్ఞాపికను అందించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పుణ్యక్షేత్రం డైరెక్టర్ రెవ. ఫాదర్ ఎండీ ప్రసాదరావు, బిషప్ సెక్రటరీ ఫాదర్ లూర్దురాజు, ఫాదర్ బాలశౌరి. సహాయ డైరెక్టర్ పిల్లి మహేష్, ఫాదర్లు విజయరావు, మరియన్న, చైతన్య, ఆరోగ్యమాత మదర్ జనరల్ సుపీరియర్ మదర్ సెల్వి రాయప్పన్, ఫాదర్ కిరీటి,ఆరోగ్యమాత, జేయంజె, క్రీస్తు జ్యోతి సిస్టర్స్, చర్చి పెద్దలు, యూత్ కమిటీ, మరియదళం, మౌలిక సంఘం సభ్యులు, విశ్వాసులు పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యకరమైన జీవనం

– వైవీయూ వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి

వైవీయూ: పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతంగా జీవించవచ్చని యోగి వేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి అన్నారు. ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ వి. రామకృష్ణ ఆధ్వర్యంలో 'జాతీయ పోషకాహార వారోత్సవాలను' వైస్ చాన్సలర్ ఆచార్య కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డిలు వైవీయూలోని సైన్స్ బ్లాక్ సెమినార్ హాల్లో జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ తక్కువ ఖర్చుతోనే పోషక విలువలు లభించే ఆహార పదార్థాల గురించి వివరించారు. జంక్ ఫుడ్స్‌కు దూరంగా ఉండాలని, సంప్రదాయ ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు. పోషకాహార లోపం వల్ల ఇప్పటికీ ప్రజలు మృత్యువాత పడుతుండడం బాధాకరమన్నారు. జన్యు పరంగా మార్పులు చేసిన ఆహార పదార్థాలు ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయని, క్యాన్సర్ వంటి వ్యాధులు వస్తాయన్నారు. కుల సచివులు ఆచార్య ఎస్. రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ పోషకాలు లేని ఆహార పదార్థాలు తీసుకోవడం ద్వారా భవిష్యత్తులో మాత్రలు తినాల్సి వస్తుందన్నారు. ఈ వారోత్సవాల్లో విద్యార్థులు విశ్వవిద్యాలయ చుట్టుపక్కల గ్రామాలకు వెళ్లి ప్రజలకు పోషకాహారం పట్ల చైతన్యం చేయాలని సూచించారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, గర్భిణీలకు అవగాహన కల్పించాలని కోరారు. పాత తరం వంటలు అందులో లభించే పోషకాలు గురించి వివరించారు. ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి, కార్యక్రమ కన్వీనర్ డాక్టర్ వి. రామకృష్ణ మాట్లాడుతూ ఫుడ్ టెక్నాలజీ విభాగం అభివృద్ధి గురించి వివరించారు. ఈ ఏడాది వారోత్సవాల థీం 'ఆహారపు అలవాట్లు ఆరోగ్యకర జీవన విధానం'గా నిర్ణయించారని తెలిపారు. వారోత్సవాలలో శాఖ నిర్వహించే కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో సహ ఆచార్యులు డాక్టర్ కే రియాజున్నీసా, డాక్టర్ పి అరుణ, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వైవీయూ వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి

పౌష్టికాహారాన్ని తీసుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : పౌష్టికాహార లోపంతో ఉన్న గర్భిణీలు, బాలింతలు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని జిల్లా మహిళా అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ సాధికారత అధికారి బి.శ్రీలక్ష్మి తెలిపారు. మంగళవారం పోషణ మాసోత్సవాల సందర్భంగా జిల్లాలోని పలు అంగన్వాడీ కేంద్రాలను ఆమె తనిఖీ చేసి మాట్లాడారు. పోరుమామిళ్ల, బద్వేలు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని సిద్దవరం అంగన్వాడీ కేంద్రాన్ని, అట్లూరు మండలంలోని కొందూరు ఎస్టీ అంగన్వాడీ కేంద్రాన్ని, బద్వేలు రూరల్ రామ్‌నగర్‌లోని అంగన్వాడీ కేంద్రాన్ని, బి.కోడూరులోని ఐత్రంపేట అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు. అంగన్వాడీ కేంద్రాల్లో పండించిన ఆకుకూరలు, కూరగాయలు పంపిణీ చేస్తున్నారని తెలిపారు. అనంతరం ఆమె అంగన్వాడీ కేంద్రంలోని చిన్నారులతో మొక్కలను నాటించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, సీడీపీఓలు తదితరులు పాల్గొన్నారు.



మహిళకు రక్త పరీక్ష చేస్తున్న విధానాన్ని పరిశీలిస్తున్న ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి

డ్రైవర్లు క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తున్న డ్రైవర్లు క్రమశిక్షణతో విధులు నిర్వర్తించి సంస్థ పురోభివృద్ధికి పాటుపడడంతోపాటు ఆర్టీసీకి మంచి పేరు తేవాలని జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్ రెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో రీజియన్ పరిధిలోని కడప, పులివెందుల, ప్రొద్దుటూరు, బద్వేలు, మైదుకూరు, జమ్మలమడుగు డిపోలకు చెందిన డ్రైవర్లకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు ప్రమాద రహిత ఆర్టీసీగా సంస్థను నిలబెట్టేందుకు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా విధి నిర్వహణ సమయంలో ప్రతి డ్రైవరు ప్రయాణీకులతో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని, సెల్ ఫోన్ డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని, డ్రైవింగ్ సమయంలో ధూమపానం చేయడం మానుకోవాలని సూచించారు.



శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్ రెడ్డి

అలాగే డ్రైవర్లు అధిక కేఎంపీఎల్ సాధించడంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సంస్థలో కీలక పాత్ర పోషించాల్సిన విషయాన్ని డ్రైవర్లు గుర్తించుకోవాలన్నారు. అనంతరం పులివెందుల డిపో మేనేజర్ రామకృష్ణ ఇంధన పొదుపునకు పాటించాల్సిన పంచసూత్రాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ సీజే రావు, రీజినల్ సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ కృష్ణారెడ్డి పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

ఏఎఫ్‌యూ: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ఆచార్య జి. విశ్వనాథకుమార్ పేర్కొన్నారు. మంగళవారం విశ్వవిద్యాలయంలో స్టెప్, జేబీవీఎస్ ది ప్రిజర్వర్ స్వచ్ఛందసేవా సమితి ఆధ్వర్యంలో 'తల్లి పేరుతో ఒక మొక్క' కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్యాన్ని దృష్టిలో ఉంచుకుని అందరూ పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు కనీసం అమ్మ పేరు మీద ఒక మొక్కను నాటాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఇన్ చార్జి రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ సెప్టెంబర్ నెలలో 500 మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

జేబీవీఎస్ ది ప్రిజర్వర్ సేవాసమితి వ్యవస్థాపకుడు అశోక్ మాట్లాడారు. అనంతరం విశ్వవిద్యాలయంలో మొక్కలు నాటారు.



వైఎస్ఆర్ ఏఎఫ్‌యూలో మొక్కలు నాటుతున్న వీసీ, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు

తిరిగి విధుల్లోకి తీసుకోవాలంటూ ఆందోళన

ఏఎఫ్‌యూ: కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో పనిచేస్తూ ఇటీవల తొలగింపబడిన బాధితులు ఆందోళన చేపట్టారు. మంగళవారం డా. వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ ప్రధాన ద్వారం వద్ద బాధిత సిబ్బంది బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో మార్చి నెలలో తామంతా విధుల్లో చేరామని, దాదాపు 5 నెలలపాటు పనిచేసి, వేతనాలు కూడా తీసుకున్నామన్నారు. అయితే గత నెలలో ఒక్కసారిగా మమ్మల్ని ఉద్యోగాలకు రావద్దని అధికారులు చెప్పారన్నారు. ఉన్నట్టుండి ఉద్యోగాల్లో నుంచి తీసివేయడం సరికాదన్నారు. చిరుద్యోగులపై అధికారులు ఇలాంటి చర్యలకు పాల్పడడం బాధాకరమన్నారు. మానవతా దృక్పథంతో తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు.



వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ వద్ద బైఠాయించి నిరసన తెలుపుతున్న బాధిత సిబ్బంది



రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు

దుర్గమ్మ సన్నిధిలో దోష నివారణ పూజలు

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయ దుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలను నిర్వహించారు. తొలుత అమ్మవారి మూల మూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజా విధానాన్ని తెలుపుతూ కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు. భక్తులు అమ్మవారికి నిమ్మకాయ దీపాలను వెలిగించి మొక్కుకున్నారు.

బ్రౌన్ గ్రంథాలయ నూతన నిర్మాణ పనులు చేపట్టాలి

వైవీయూ: సీపీ బ్రౌన్ గ్రంథాలయం నూతన భవనం నిర్మాణ పనులు త్వరగా చేపట్టాలని బ్లడ్ టు లివ్ స్వచ్ఛందసేవాసంస్థ వ్యవస్థాపకుడు పట్టుపోగుల పవన్ కుమార్ మంగళవారం వైవీయూలో వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో సీపీ బ్రౌన్ నూతన భవన నిర్మాణానికి నిధులు రూ.6,87,40,000 కేటాయించారన్నారు. అందులో స్థల యజమానికి రూ. 3,21,40,000 ప్రభుత్వం చెల్లించిందన్నారు. అలాగే నూతన భవనం నిర్మాణం కోసం రూ. 3,66,00,000 నిధులు వైవీయూకు కేటాయించారన్నారు. కానీ ఇప్పటి వరకు నూతన గ్రంథాలయ భవనం నిర్మాణ పనులు ప్రారంభించక పోవడం చాలా బాధాకరమన్నారు.

లైఫ్ సపోర్ట్ స్కిల్స్ నేర్చుకోవాలి



మాట్లాడుతున్న కడప వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ

కడప అర్బన్: క్లిష్టమైన స్థితిలో వున్న రోగులకు ప్రాణాలను కాపాడే అధునాతనంగా ప్రతి ఒక్కరూ కార్డియాక్ లైఫ్ సపోర్ట్ స్కిల్స్ ను నేర్చుకోవాలని కడప ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ అన్నారు. మంగళవారం కడప రిమ్స్ ఆవరణంలోని మానసిక వైద్యశాల ఆవరణంలో అనస్తీషియాలజీ విభాగం వారు ఏసీఎల్ఎస్ (అడ్వాన్స్‌డ్ కార్డియాక్ లైఫ్ సపోర్ట్) కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభంకు ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ మాట్లాడుతూ ప్రతి వైద్య విద్యార్థి , పీజీ వైద్య విద్యార్థి, వైద్యులు, సిబ్బంది అధునాతనంగా ఎప్పటికపుడు రూపొందించబడిన ఏసీఎల్ఎస్ ద్వారా మెళుకువలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఆపద సమయాలలో వున్న రోగులను కాపాడేందుకు ఈ మెళుకువలను నేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. సురేశ్వర్‌రెడ్డి, వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, మానసిక వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటరాముడు, అనస్తీషియా హెచ్ఓడి డాక్టర్ సునీల్ చిరువెళ్లలు హాజరయ్యారు. వీరితో పాటు 39 మంది పీజీ వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో వినాయకచవితి పండుగను నిర్వహించుకోవాలి



వినాయక ఉత్సవ కమిటీలతో సమావేశమైన పోలీసు అధికారులు, సిబ్బంది

కడప అర్బన్: మతసామరస్యానికి ప్రతీక అయిన కడప జిల్లాలో వినాయక చవితి పండుగను ఎలాంటి ఘటనలకు తావులేకుండా భక్తి భావంతో జరుపుకునేందుకు అందరూ సమన్వయంతో ముందుకు సాగాలని పోలీస్ అధికారులు పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో వినాయక చవితి పండుగ నేపథ్యంలో పీస్ కమిటీ, ఉత్సవ కమిటీలతో సమావేశాలు నిర్వహించారు. అన్ని వర్గాల ప్రజలకు, శాంతి భద్రతలకు, మతసామరస్యానికి ఇబ్బంది కలుగకుండా వినాయక ఉత్సవాలు నిర్వహించాలన్నారు. ప్రాంతాల, వీధుల వారీగా ఏర్పాటు చేస్తున్న ఉత్సవాల నిర్వహణ కమిటీ సభ్యులు ముందస్తుగా సంబంధిత అధికారుల వద్ద అనుమతులు తీసుకోవాలన్నారు. సమావేశంలో గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీల నిర్వాహకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కడపలో పోలీసుల స్పెషల్ డ్రైవ్

కడప అర్బన్: జిల్లా ఎస్పీ ఆదేశాలతో కడప నగరంలో, శివార్లలో స్పెషల్ డ్రైవ్ మంగళవారం రాత్రి కొనసాగింది. బ్లూకోల్ట్స్, స్పెషల్ పార్టీ సిబ్బంది మొత్తం 50 మందితో ముమ్మరంగా వాహనాలను తనిఖీ చేయడంతో పాటు నైట్ పెట్రోలింగ్ చేపట్టారు. స్పెషల్ డ్రైవ్‌లో కడప తాలూకా సీఐ జి. వెంకటేశ్వర్లు, కమాండ్ కంట్రోల్ ఇన్‌స్పెక్టర్ ఎం. వెంకటేశ్వర్లు, ఎస్ఐ ఎల్ జీవన్‌రెడ్డి, రిమ్స్ పీఎస్ ఎస్ఐ జయరాముడు, పి.సిఆర్ ఎస్ఐ జయగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠినచర్యలు తప్పవన్నారు.

ఘన సన్మానం



వ్యాయామ ఉపాధ్యాయురాలు వెంకటలక్ష్మిని సన్మానిస్తున్న దృశ్యం

కడప ఎడ్యుకేషన్: జేకే జనం కోసం విద్యా సాంస్కృతిక క్రీడాభివృద్ధి రాష్ట్ర అధ్యక్షులు లయన్ పఠాన్ ఖాదర్ బాషా ఆధ్వర్యంలో వ్యాయామ ఉపాధ్యాయురాలిని సన్మానించారు. సెప్టెంబర్ 5న ఉపాధ్యాయుల దినోత్సవం పురస్కరించుకుని జేకే జనం కోసం సంస్థ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు విద్యతోపాటు క్రీడల్లో ఉత్తమ సేవలందించిన ఉపాధ్యాయులను సత్కరించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా మంగళవారం కడప నగరపాలక ఉన్నత పాఠశాల మెయిన్‌లో వ్యాయామ ఉపాధ్యాయురాలుగా పని చేస్తున్న వెంకటలక్ష్మిని సన్మానించారు. కార్యక్రమంలో కరీం సేవా సంస్థ అధినేత అబ్దుల్ షేక్ రాయల్ కరిముల్లా, విద్యార్థులు పాల్గొన్నారు.

తైక్వాండోలో ప్రతిభ



నాగేంద్రబాబుకు బంగారు పతకాన్ని అందజేస్తున్న అతిథులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆంధ్రప్రదేశ్ స్టేట్ మెన్ అండ్ ఉమెన్ తైక్వాండో చాంపియన్‌షిప్–2024లో భాగంగా తిరుపతిలో గతనెల 30, ఈనెల 1వ తేదీలలో జరిగిన పోటీలలో ఉమ్మడి కడపజిల్లా వాసులు నాగేంద్రబాబు అండర్–87 కిలోల విభాగంలో, కె.ధర్మతేజ 84 కిలోల విభాగంలో బంగారు పతకాలు సాధించినట్లు కడపజిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ తెలిపారు. పాండిచ్చేరిలో త్వరలో జరిగే నేషనల్ పోటీలకు వీరు అర్హత సాధించారన్నారు.

నేడు ఉపాధ్యాయులకు సత్కారం

కడప కల్చరల్ : భారత జాతీయ కళా సంస్కృతి వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటాక్) ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఉపాధ్యాయులను సత్కరించనున్నట్లు సంస్థ జిల్లా చాప్టర్ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 3.30 గంటలకు స్థానిక మానస ఇన్ సమావేశ మందిరంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి యోగి వేమన ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు తెలిపారు. గౌరవ అతిథిగా జిల్లా నీటిపారుదలశాఖ ఎస్ఈ కమతం శ్రీనివాసులు, విశిష్ట అతిథిగా ఆచార్య ఎన్.ఈశ్వర్‌రెడ్డి హాజరవుతారన్నారు. ఇంటాక్‌లో సభ్యులుగా ఉన్న ఉపాధ్యాయులందరినీ సత్కరించనున్నట్లు తెలిపారు.

వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ అభివృద్ధికి ఎంపీ ల్యాడ్స్‌కు వినతి

ఏఎఫ్‌యూ: కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి ఎంపీ ల్యాడ్స్ నిధులను కేటాయించాలని డా. వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య జి. విశ్వనాథ కుమార్ కోరారు. మంగళవారం కడప విమానాశ్రయంలో అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్‌నాయుడును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ గతంలో ఎంపీని కలిసి విశ్వవిద్యాలయ ప్రగతిపై చర్చించినప్పుడు తగిన ప్రతిపాదనలతో ముందుకురావాలని సూచించారన్నారు. దీంతో విశ్వవిద్యాలయంకు ప్రధానంగా అవసరమైన ల్యాబ్‌ల నిర్మాణం, తద్వారా నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు వీలవుతుందన్నారు. ఇందులో భాగంగా ఫొటోగ్రఫీ ల్యాబ్, సినిమాటోగ్రఫీ ల్యాబ్, జీడీటీ ల్యాబ్, మ్యాక్స్ హబ్ డిజిటల్ మానిటర్స్, కార్పెంటరీ ల్యాబ్, సాఫ్ట్‌వేర్ కొనుగోలు, ఇతరత్రా నిర్మాణ పనుల నిమిత్తం రూ.2 కోట్ల మేర ప్రతిపాదనలు అందజేసినట్లు తెలిపారు. దీనికి ఎంపీ సానుకూలంగా స్పందించినట్లు వీసీ తెలిపారు. అదే విధంగా పెండ్లిమర్రి మండలం గంగనపల్లి గ్రామంలో విశ్వవిద్యాలయ నిర్మాణానికి కేటాయించిన 110.36 ఎకరాల స్థలంలో నిర్మాణాలు చేపట్టేందుకు సహకారం అందించాలని కోరినట్లు తెలిపారు.

కళాశాల సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి



స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రాం ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా

వైవీయూ: విద్యార్థులకు కళాశాల అందించే సౌకర్యాలు, మౌలిక సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా సూచించారు. మంగళవారం కళాశాలలో స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలో విభాగాల వారీగా ఉన్న ప్రయోగశాలలు, లైబ్రరీ, జేకేసీ, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ తదితర సౌకర్యాలు, వనరుల గురించి వివరించారు.

ఈ కార్యక్రమం నూతనంగా విచ్చేసే విద్యార్థులకు సౌకర్యాల గురించి తెలియజెప్పేందుకు 21 రోజుల పాటు ఈ ప్రోగ్రాం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అకడమిక్ కోఆర్డినేటర్ డా. నాగమునిరెడ్డి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా. కృష్ణవేణి, డా. పి. సుబ్రమణ్యం, డా. ప్రకాష్‌నారాయణరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.